జీవితాంతం బాధపడాలి!" ఏడ్చేసింది చంద్రమ్మ.

సూర్యం కరిగి పోయాడు. చిట్టి - బాబు అంటే వారికి అమిత మైన ప్రేమ - వాళ్ళు బ్రతికేదే వాళ్ళ కోసం.

" అయితే ఏంటంటావే - పునాదులు తవ్వద్దంటావా? మరి ఈ గాడిదలు - కుక్కలు నా బీభత్సవం చేస్తున్నాయి ఇంటి మీద పడి - కాంపౌండు ఇంటికి రక్షణ ! దొంగలు కూడా రాలేరు." చెప్పాడు సూర్యం.

" రెండేళ్ళుగా లేంది ఇప్పుడు మటుకు ఏం కొంపలంటుకుంటాయి?"

" అప్పుడేదో కంచె ఉంది... అది పాడై పోయిందనిగా మనం ప్రహారీగోడ కట్టిస్తున్నది- ఉన్న ఆ కాస్త రక్షణ కూడ తీసేశాం - మళ్ళీ పెట్టాలంటే బోల్డు ఖర్చు - అయినా అది కాదే ! అడ్వాన్సు యిచ్చాను - వాళ్ళు రాళ్ళు గచ్చు - అంతా తెచ్చుకున్నారు - పనోళ్ళు వచ్చారు - మళ్ళీ ముహూర్తం అంటే మనకంతా వేస్టు అయిపోతుంది." సూర్యం తెగ బాధపడ్డాడు.

" ఏవండోయ్! ఆయన చెప్పింది పునాదులు తవ్వద్దనేగా - గోడ కట్టవద్దని చెప్పలేదుగా - గోడ కట్టించెయ్యండి - " సంతోషంగా చెప్పింది.

" ఏంటి పునాదులు లేకుండా గోడ కట్టాలా? మతి ఉందా ?" ఆశ్చర్యంగా అడిగాడు.

" దాందేముంది - డబ్బు లేనోళ్ళు ఎంత మంది సరిహద్దుగా రాళ్ళు పేర్చుకుని పెట్టుకోరు - మనము అదే పని చేద్దాం - తెచ్చిన వాటిని టెంపరరీగా గోడలా కట్టమనండి - ఆ తరువాత ఒక శుభముహూర్తాన మళ్ళీ కట్టిద్దాం - " చెప్పింది.

సూర్యంకు ఈ సలహా బాగా నచ్చింది.

వెంటనే కూలీలను పిల్చి పునాదులు తవ్వద్దు రాళ్ళను గోడలాగా పేర్చమని చెప్పాడు.

" లేదు దొరా ! మా పనికాదు - మేము తవ్వేవాళ్ళమే ! గోడ కట్టే గౌండా వేరే ఉన్నాడు - ఇప్పుడు మేము తవ్వాలా వద్దా చెప్పండి." మేస్త్రీ అడిగాడు.

